

# గోరువెచ్చని సూర్యుడు

-జె.సుధ

బేసిక్‌గా ప్రతీ ఆడపిల్లలోనూ పుట్టుకతోనే తల్లి మనసు ఉంటుంది. మథర్ థెరెస్సా అయినా... సుస్మితాసేన్ అయినా... ఆఖరికి నేను అయినా...

అవును! నేను కూడా!!

ఓ మనిషి మరో మనిషి మీద మమకారం పెంచుకుంటూ పోతే అది మరో జన్మకి శ్రీకారం అవుతుంది. ఈ సత్యం నాకు ఆ భగవంతుడు ఈ మంచుకొండల్లో తెలియజేశాడు.

తల్లిదండ్రుల ఆశలకి ఆలంబనగా, అల్లారుముద్దుగా పెరిగిన నేను, పరికిణీ కుచ్చిళ్ళన్ని తన్నుకుంటూ, ఏ సుదూర తీరాలల్లోనో, ఓ అందమైన ప్రపంచం నాకోసం నిర్మించబడే ఉంటుంది అని కలలు కంటూండగానే నా 'టీనేజ్' వెళ్ళిపోయింది. నవ్వినా, నడిచినా ఆరాధనతో నీరాజనాలు పట్టే అబ్బాయిలు- ప్రతీ అమ్మాయి జీవితంలోనూ ఉంటారు. ఆ అందమైన అనుభూతి నా కాలేజ్ జీవితంలో నేనూ చవిచూశాను. గర్వంగా ఫీల్ అయ్యాను.

నక్షత్ర దోషం, జాతక దోషం అంటూ వచ్చిన ప్రతీ మంచి సంబంధం జాతకాల దగ్గరే ఆగిపోయేవి. అమ్మ కనిపించిన ప్రతీ నదిలోనూ మునిగి, కనబడని ప్రతీ దేముడికీ మ్రొక్కేది. 'దీని తలరాత ఇంతే' అని నిత్యం ఏడ్చి, తన నిస్సహాయతని బయటపెట్టుకునేది. 'మా తప్పు ఏంలేదు' అంటూ ఆత్మరక్షణకు దిగేది.

నాన్నా మాత్రం నన్ను చదువులో బాగా ప్రోత్సహించారు. ఊరికినే ఉండటం ఎందుకు అని జాయిన్ అయిన జాబ్. సంసార బంధనాలు లేకపోవడంతో, బాగా పనిచేసి పైకి రాగలిగాను. ఈరోజు ఒక బాధ్యతాయుతమైన పదవి, దానికి తగ్గ గౌరవం సౌకర్యం.

ఎన్ని ఉన్నా! పెళ్ళికాలేదు అన్న తాపం, సమాజంపరంగా నాకు చాలా కష్టాల్ని కల్పించింది. 'ఆశ'గా చూసే మగవాళ్ళు 'అసూయ'గా చూసే ఆడవాళ్ళు. వీళ్ళ నుండి నన్ను నేను కాపాడుకునే ప్రయత్నంలో, నాలోని సున్నిత తత్వాన్ని చంపేసుకుని, అర్థంలేని ద్వేషంలో నింపేసుకుని నన్ను నేను హింసించుకునే దాన్ని.

ఎన్ని ఉన్నా! పెళ్ళికాలేదు అన్న తాపం, సమాజంపరంగా నాకు చాలా కష్టాల్ని కల్పించింది. 'ఆశ'గా చూసే మగవాళ్ళు 'అసూయ'గా చూసే ఆడవాళ్ళు. వీళ్ళ నుండి నన్ను నేను కాపాడుకునే ప్రయత్నంలో, నాలోని సున్నిత తత్వాన్ని చంపేసుకుని, అర్థంలేని ద్వేషంలో నింపేసుకుని నన్ను నేను హింసించుకునే దాన్ని.

చెయ్యని తప్పుకి శిక్ష అనుభవిస్తున్న భావన. సెల్ఫ్ పిటీ.

ద్రాక్ష పళ్ళు అందుకోలేని నక్కలా, నాకు అందని దాని మీద చిన్నచూపు. పెళ్ళికాకపోతే బ్రతక లేనా అన్న పట్టుదల. ఈ ప్రపంచం మీద, ఈ మూఢ నమ్మకాల మీద. నా తల్లితండ్రుల నిస్సహాయత మీద, ఒక విధమైన కక్ష. ఈ కక్షతోటే నా చుట్టుప్రక్కల ప్రపంచాన్ని గమనించేదాన్ని.

పంట కాలువలో 'గుఱ్ఱపుడెక్క ఆకు'లా ఈ భార్యాభర్తల బంధం పైకి ఎంతో దృఢంగా అల్లుకుని కనిపిస్తుంది. కానీ చిన్న కట్టెతో అది లించినా చాలు కదిలిపోతుంది. అందమైన పొదరిల్లులాంటి ఈ సంసారాలు అవసరం. సాంఘిక భద్రత పునాదులుగా నిలబడిన భవనాలే. 'యిగో'లలో ఒకరిపై ఒకరు ఆధిపత్యం కోసం తపించే జంటలే. పెళ్ళి అంటే సుఖసంతోషాలు అనే ఎండమావుల వెంట పరుగే అని నాకు అర్థం అయిన తరవాత, అసలు దానికి దూరంగా ఉండటమే మంచిది అని అనిపించింది. అమ్మ, నాన్నకి ఇదే చెప్పాను.

కానీ ప్రసాద్? ఎంత ప్రేమని కురిసేవి అతడి కళ్ళు. నేను నడిచేచోట తన అరచేతులు పెట్టాలని. నా చూపు తిప్పుకునేచోట తన ముఖం అతికించుకోవాలని. కనీసం నా నీడనైనా తాకాలని, ఎంత తపన? ఆ తపనే నాలోని శాడిజాన్ని లేపింది. ఎదుటి మనిషిని చదివాక, వాళ్ళు పూర్తిగా మన గ్రిప్‌లోకి వచ్చాక. ఏం తెలియనట్లు అమాయకంగా నటించడం. నాకు తెలుసునన్న విషయం అతనికి తెలియడం, అతనికి తెలుసునన్న విషయం నాకు కూడా తెలియడం. ఇది అంతా ఒక ఆట.

"ఈ రోజుల్లో కూడా జాతకాలు. నక్షత్రాలు ఏంటి? అంతా నాన్‌సెన్స్?? మా పేరెంట్స్‌ని ఒప్పించే బాధ్యత నాది." అంటూ చాలా ఆవేశంగా వెళ్ళిన ప్రసాద్, నాలోనూ చిన్న ఆశని, స్పందనని కల్గించకపోలేదు. అయితే ఇది రిజల్ట్‌ముందే తెలిసిన 'క్రికెట్ మేచ్' లాంటిది. నేను పెద్దగా బాధపడలేదు.

బహుశ అప్పటినుండే నా ఈ వంటరి ప్రపంచానికి పునాది పడింది. ఇది కూడా నా ఫ్రెండ్ గొప్పదనమే. అది ప్రజెంట్ చేసిన మొట్టమొదటి బుక్. నాకు కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది. ఆవేశపెట్టే ఆశల్ని, అర్థం పర్థం లేకుండా మనసునిండా పరుచుకునే ఆర్ద్రతని ఎలా సంబాళించుకోవాలో తెలియని నాకు, నా ఆలోచనల్ని ఎలా దిశానిర్దేశించాలో, జీవితంలోనుండి ఆనందాన్ని ఎలా వెలికి తియ్యాలో అర్థం అయింది. నా పుస్తక ప్రపంచం నేను ఏమిటో చెప్పకపోయినా? నేను ఎలా ఉండాలో చెప్పేది. నన్ను బుజ్జగించేది.

"ఎందుకే? అలా వందలు వందలు పుస్తకాలమీద తగలేస్తావు? సంపాదించగానే సరికాదు. పొదుపు చెయ్యడం రావాలి. నీకు చేతకాకపోతే ఆ విషయం నేను చూసుకుంటాను"అనేవాడు అన్నయ్య. వాడి మాటలలో పుట్టుకతో వచ్చే 'హక్కు'మాత్రమే కనబడేది నాకు. నా సంపాదన అంతా వాడిది. తరవాత వాడి పిల్లలిది, అని అప్పటికే ఒక నిర్ణయానికి వచ్చేశాడు వాడు.

ఇంక వదిన ఇద్దరు పిల్లల తల్లి. ఆర్థిక స్వతంత్ర్యం లేని అసహాయత. గుర్తింపు లేని చాకిరీ. అందరిలాగే ఆమెకీ కొన్ని బలహీనతలు. 'ఈత'గింజ వేసి 'తాటి'గింజ లాగ గలిగే లౌక్యం. తన నాలుగేళ్ళ కొడుకుని రోజుకి ఒకసారి అయినా ఇదిగో 'నీ కొడుకు'అంటూ నా ఒళ్ళో కూర్చోపెడుతూ ఉంటుంది. నాకు కాఫీ

అందించడం దగ్గరనుండి, నా అవసరాలు అన్నింటికి 'ఇదిగో నేను ఉన్నాను సుమా'అంటూ నాకు తెలిసేలా ప్రవర్తించడానికి చాలా అవస్థలు పడుతుంది.

అమ్మ మరో రకం. కొడుకుమీద కొండంత ప్రేమ. ఆఖరి రోజుల్లో చూసుకునేందుకు కూతురు ఉంది అన్న ధీమా. 'నీ అవసరం నాకు లేదు' అన్న నిర్లక్ష్యం- కోడలి ముందు ప్రతీక్షణం ప్రదర్శిస్తుంది. నాన్నది మరో లోకం. ఆ 'ఆర్‌బిట్'లోకి నేను అసలు తొంగి చూడలేను కూడా.

వీళ్ళు అందరూ నా వాళ్ళు. నేను ఎలా ఉండాలో నిర్ణయించేవాళ్ళు. 'నువ్వు ఎలా ఉండాలనుకుంటున్నావు?'అని అడగలేని వాళ్ళు. నాకు ఏమీ కాని నా వాళ్ళు. వాళ్ళ బలహీనతలతోపాటు నాకు అర్థం అయ్యాక. నేనూ వాళ్ళనుండి చిన్నపాటి ప్రేమని కూడా ఆశించడం మానేశాను. ఎటాచ్‌మెంట్ విత్ డిటాచ్‌మెంట్ అన్నమాట.

అప్పటినుండి నన్ను నేను ప్రేమించుకోవడం. నా ఆనందం కోసం కూడా బ్రతకడం. ముఖ్యంగా మనసులో నుండి నవ్వడం నేర్చుకున్నాను. జీవితంలో ప్రతీ 'బీట్'నీ ఎంజాయి చెయ్యాలి. ఏదో ఒక సంఘటన దగ్గరే మనసుని ఆపేసుకోకూడదు అని నాకు అర్థం అయింది. ప్రతీ సూర్యోదయం నాకోసం కొత్త ఆశలతో వస్తుంది. నా మనసు ముంగిట అందమైన రంగవల్లులు తీర్చిదిద్దుతుంది. రాబోయే క్షణాల గురించి ఆశగా, ఆనందంగా ఎదురు చూడగల్గడమే జీవితంలో గొప్ప ఆనందం. ముఖ్యంగా ఆశతో కూడిన ఆలోచన గొప్ప మనఃశ్శాంతిని ఇస్తుంది.

★ ★ ★

ప్రకృతి అన్నా, ప్రయాణం అన్నా ఇష్టపడే నేను. అమ్మ నాన్నలతో ఇంచుమించు దేశం అంతా తిరిగాను. ఈసారి మాత్రం అన్నయ్యకి లీవు దొరకడంతో 'మనాలీ' బయలుదేరాం. నా చీరలు, డ్రెస్‌లు అన్నీ తనే రెడీచేసి వదిన చాలా శ్రమ తీసుకుంది.

కూలీలకి, డ్రైవర్లకి బేరం చెయ్యకుండా అడిగినంతా ఇచ్చి డబ్బు తగలెయ్యకు అవి అన్నీ నేను చూసుకుంటాను. కొత్త వాళ్ళని, అందులో ఆడవాళ్ళని చూస్తే ముందరే చెట్టుఎక్కి కూర్చుంటారు''అంటూ ఇంటి దగ్గరే వార్నింగ్ ఇచ్చాడు అన్నయ్య. అసలు అన్నయ్య ఎప్పుడూ ఇంతే. మనిషి అనే వాడిని అస్సలు నమ్మడు. వీడి అభద్రతాభావం లోంచి వచ్చే సమస్యలు చాలానే ఉన్నాయి. లాభనష్టాల బేరీజుతో సున్నితమైనవి చాలానే కోల్పోయాడు వీడు. వీడిని చూస్తే నాకు జాలి తప్ప మరో అభిప్రాయం రాదు. 'ఆడవాళ్ళతోటి, పిల్లలతోటి అస్సలు ప్రయాణం చెయ్యకూడదు.' అంటూ దారిపొడవునా, సణుగుతూనే ఉన్నాడు.

ఏడాదిలో పది నెలలు, తన ప్రతాపంతో జనాల్ని మాడ్చి మసిచేసే సూర్యుడు, ఇక్కడ కొండల్లో మాత్రం కూల్‌గా, గోరువెచ్చగా, రోమాంటిక్‌గా, పగలే వెన్నెల కురిపిస్తాడు. గాలిని సైతం గడ్డకట్టించి, ఊపిరి తీసుకోవడానికి కూడా కష్టంగా ఉండే అతి శీతల వాతావరణం. మెలికలు తిరిగిన ఆ కొండదారుల్లో ప్రకృతినుండి ప్రకృతిలోకి అలా అంతులేని ప్రయాణం నాలుగురోజులుగా చేస్తూనే ఉన్నాం. ఎక్కడా తృప్తిగాని, అలసట గానీ కలగలేదు.

★ ★ ★

మెకుకువ వచ్చేసరికి ఆరు గంటలు అయింది. మీద బరువైన రొజాయి చలిని మరింతగా పెంచింది. ప్రక్క గదిలోంచి అన్నయ్య గురక వినిపిస్తోంది. మధ్య రాత్రి ఎప్పుడు వచ్చిందోగాని పిల్లల్ని ఇద్దరినీ చెరోప్రక్క పొదువుకొని వదిన గాఢ నిద్రలో ఉంది. చూడముచ్చటైన దృశ్యం. ఎనిమిది గంటలకంతా హోటల్‌వాళ్ళు ఎరేంజ్ చేసిన వేన్‌లో లోకల్ సైట్ సీయింగ్‌కి వెళ్ళాలి. ఈ చలిలో స్నానం సంగతి అటు ఉంచి కనీసం మొహాలు కడిగి రెడీ అవ్వాలి కదా! కానీ నాకు ఈరోజు ఎక్కడికీ కదలాలని అనిపించటంలేదు. ఎంత అయినా నేను వాళ్ళ 'ప్రైవసీ'కి అడ్డం. రాత్రిళ్ళు వాళ్ళ అవస్థని చూస్తునే ఉన్నాను కదా! ఒక్కరోజు వాళ్ళని ఫ్రీగా వదిలితేనే బావుంటుంది అనిపించింది.

''క్రిందటిసారి వచ్చినపుడు, ఇవి అన్నీ నేను చూశాను.



ఏడాదిలో పది నెలలు, తన ప్రతాపంతో జనాల్ని మాడ్చి మసిచేసే సూర్యుడు, ఇక్కడ కొండల్లో మాత్రం కూల్‌గా, గోరువెచ్చగా, రోమాంటిక్‌గా, పగలే వెన్నెల కురిపిస్తాడు.

ఈసారి మీరు వెళ్ళి రండి.'' అన్నాను భయంగానే. వదిన ముందు ఒప్పుకోలేదు. గొడవ చేసింది.

''మళ్ళీ ఇదొకటే! నిన్ను వదిలేసి వెళితే, మళ్ళీ నాకు అదో టెంక్షన్. ఎందుకొచ్చిన గొడవగాని. త్వరగా రెడీ అవ్వు''అన్నాడు అన్నయ్య విసుగ్గా మొహం పెట్టి. భూమి గుండ్రంగా ఉంది అన్నట్లు. వాడి జీవితంలో అన్ని టెంక్షన్‌లు, సమస్యలు నా దగ్గరే మొదలు అయి, నాతోనే ముగుస్తాయి మరి.

''అది కాదు అన్నయ్యా! చేతిలో సెల్ ఉంది. సాయంత్రానికి మీరు తిరిగి వచ్చేస్తారు కదా! మీరు వెళ్ళి రండి. నేను ఏమన్నా చిన్న పిల్లనా?'' అన్నాను. వదిన ముఖంలో దాచుకోలేని సంతోషం- నాకు అర్థం అవుతోంది.

వాళ్ళని అయితే పంపించేశాను గానీ సాయంత్రందాకా ఈ రూమ్‌లో కూర్చుని ఏం చెయ్యాలో నాకు అర్థంకాలేదు. స్నానం చేసి, టిఫిన్ తెప్పించుకు తిని కాసేపు పేపర్ చూశాను. తర్వాత ఏం చెయ్యాలి??

క్రిందటిసారి వచ్చినపుడు కొండ మీద ఆంజనేయస్వామి గుడి అనుకుంటాను చూశాం. చాలా బావుంది ఆ ప్రదేశం. పోనీ వెళ్ళి వస్తేనో! కానీ ఒక్కదాన్నీ కాస్త భయం వేసింది. మళ్ళీ నా భయానికి నాకే నవ్వు వచ్చింది. జీవితం మొత్తం ఒక్కదాన్ని లాగించెయ్యడానికి రెడీ అయ్యాను. గుడికి వెళ్ళి రాలేనా? పట్టపగలు! చైతన్యవంతమైన ప్రకృతి!! చేతిలో సెల్!! అని నాకు నేను ధైర్యం చెప్పుకుని, పది నిముషాలలో రెడీ అయి బయటికి వచ్చాను.

దారి తెలుసుకొని వీలైతే నడిచి వెళదాం అని నా ఉద్దేశ్యం. గత నాలుగు రోజులుగా మమ్మల్ని తిప్పుతున్న డ్రైవర్ అక్కడే ఉన్నాడు. ఆ కొండ ఇక్కడికి మూడు కిలో మీటర్లు దూరం ఉంది అన్నాడు. నా పరిస్థితి డైలమాలో పడింది. కొండ దాకా మూడు కిలోమీటర్లు, కొండ మీదకి కాలి నడక ఎలాలేదన్నా రెండు కిలోమీటర్లు. మళ్ళీ తిరుగు ప్రయాణం. మొత్తం నడక అంటే కష్టం ఏమో? పోనీ మానేద్దాం అని అనుకునేలోగా, అతను హోటల్ రిసెప్షన్‌లో చెప్పి వచ్చి, కారు డోర్ తీసి పట్టుకున్నాడు. నేను వేరే ఆలోచన లేకుండా ఎక్కేశాను.

కారులో వెలిగించిన అగరుబత్తీ సుళ్ళు తిరుగుతూ గాలికి పరిమళాలు అద్దుతోంది. టేప్‌లోంచి లోకల్ ఫోక్ సాంగ్ సన్నగా వినిపిస్తోంది. ఎదురుగా బుద్ధుడి విగ్రహం ప్రశాంతంగా నవ్వుతోంది. కారు స్పీడుకి బయటనుండి వస్తున్న గాలి బ్లేడులా కోస్తోంది. వాతావరణంలో ప్రశాంతత నన్ను ఆవరించేసరికి నేనుచేసిన పని ఏంటో నాకు అర్థం అయింది. ఒక అపరిచిత వ్యక్తితో ఇలా బయలుదేరడం ఏమిటి? అన్నయ్యకి తెలిసిందంటే చంపేస్తాడు. నా జాగ్రత్తలో నేను ఉండటం మంచిది. షాల్‌ని మరింత దగ్గరగా కప్పుకుని, ఓరకంట అతడిని గమనిస్తూనే ఉన్నాను.

ఏదో హిందీ పాట విజిల్ వేసుకుంటూ హుషారుగా డ్రైవ్ చేస్తున్నాడు. బక్క పలచగా, పొడవుగా, గాలికి నిర్లక్ష్యంగా ఎగిరే జుట్టు. ఆలీవ్‌గ్రే కళ్ళు, చల్లగాలికి ఎర్రబడిన ముక్కు. నవ్వితే మాత్రం పెదవులపై పుట్టిన ఆ నవ్వు అక్కడే ఉండటం లేదు. అది బుగ్గల్లోంచి చెంపల్లోకి పాకి, చెవులకి సింధూరాన్ని అద్దుతోంది. అక్కడి యాసతో కూడిన హిందీ మాట్లాడుతూ ఉండే 'ఉదిత్ నారాయణ్' పాటలా పరవశంగా వినబడుతోంది. లోవెస్టు ఫేడెడ్ జీన్స్, బ్లాక్ జర్కిన్ వేసుకుని ఏదో సినిమా హీరోలాగా ఉన్నాడు. వయస్సు పాతిక సంవత్సరాలు ఉండవచ్చు. తల్లి, చెల్లి తరవాతి బంధం యింకా ఏర్పడినట్లు లేదు. కళ్ళలో కదలాడే స్వేచ్ఛ, ఆ కదలికల్లో చలాకీతనం. దారి పొడవునా ఎవరినో ఒకరిని విష్ చేస్తూనే ఉన్నాడు. పది నిమిషాలలో ఆ కొండ దగ్గరకి చేరుకున్నాం.

తలలు ఎత్తి పట్టుకుని గొడుగులా కమ్మేసిన బలమైన చెట్లు, ఆ చెట్లని అందంగా అల్లుకుని విరగబూసిన అడవి తీగలు, చెట్ల నిండా కోతులు ఆకుల్ని చీల్చుకుంటూ భూమిని చేరాలనే ఎండ ప్రయత్నాల్ని, గాలిలోనే అడ్డుకునే మంచు తెరలు. రాలిన ఆకుతో, రాత్రి అంతా కురిసిన మంచుతో, ఎండ కన్ను ఎరగని ఆ కొండ దారి, ఆ రాతి మెట్లు స్లిప్పరీగా ఉన్నాయి. నవ్వుతూ, తుళ్ళుతూ చేతిలో చెయ్యి వేసుకుని హుషారుగా నడుస్తున్న జంటలతో, ఆ ప్రాంతం అంతా చాలా ఆహ్లాదకరంగా కూడా ఉంది.

ఆలోచిస్తూ అడుగు ముందుకు వేశాను. కారుని పార్కింగ్‌లో పెట్టి అతను కూడా నా వెనుక బయలుదేరాడు. నిజానికి ఇది అతడి డ్యూటీ కాదు. చిన్నప్పుడు షాపుకో, సినిమాకో వెళ్ళాలి అంటే ప్రక్క ఇంటి అమ్మాయినో, అన్నయ్యనో తోడు తీసుకుని వెళ్ళేదాన్ని. వయస్సులో ఉన్నప్పుడు భార్య లేక భర్త. వృద్ధాప్యంలో పిల్లలు, ఇలా జీవితాంతం 'తోడు'కోసం తపించే ఈ మనిషి నిజంగానే వంటరి వాడు. పుట్టిన దగ్గర నుండి ఏర్పడే ప్రతీ అనుబంధం మనం ఈ ప్రపంచంలో ఎంతటి వంటరి వాళ్ళమో తెలియజేస్తూనే ఉంటుంది. నాకు నవ్వు వచ్చింది. ఈ మజిలీలో ఈ వ్యక్తి నాకు 'తోడు'అన్నమాట. ముందు వద్దు అని చెబుదాం అనుకున్నాను. కానీ అప్పటికే ఆ వ్యక్తి పది మెట్లు పైకి వెళ్ళిపోయాడు. పిలవడానికి అతని పేరు నాకు తెలియదు. అతడి వృత్తే అతడి పేరు మరి.

(మిగతా 12వ పేజీలో)

నాలుగు మెట్లు ఎక్కేసరికి నేను చేసిన పొరపాటు నాకు అర్థం అయింది. గుడి అనగానే పట్టుచీర కట్టుకోవడం. అందులో అలవాటులేని సాక్సులు, సాండిల్స్, చలికి షాల్స్ ఒక చేతితో సర్దుకుంటూ ఆ దారిలో నడవటం ఒక సర్కస్‌లా ఉంది. ఒక్కొక్క అడుగు పైకి వెళుతూ ఉంటే ఆయాసంతో గుండె బరువు ఎక్కుతూన్నది. మధ్యలో ఆయాసం తీర్చుకుందుకు ఆగవలసి వచ్చింది. పైకి వెళ్ళడానికి నాకు ఇంచుమించు ఒక గంట టైము పట్టింది.

కొబ్బరికాయ, అరటి పళ్ళు కొని దేముడి దర్శనం చేసుకున్నాను. నాతో వచ్చిన అతను దూరంగా ఎవరితోనో మాట్లాడుతున్నాడు. ఇంక అతడి టైము ఎక్కువ వేస్టు చెయ్యకూడదు అని వెనక్కి బయలుదేరాను. అతనలా ఏదో చెట్టుకొమ్మని విరుచుకుని గాలిలో కత్తిలా తిప్పుకుంటూ రెండేసి మెట్లు దిగుతున్నాడు. నాకు కొద్దిదూరంలో ఉండేలా చూసుకుంటూ.

క్రిందటిసారి వచ్చినప్పుడు ఇరవై మంది 'కొలీగ్స్'మి. కబుర్లు, జోకులు, అల్లరి, అస్సలు శ్రమ తెలియలేదు. ఈసారి మాత్రం కష్టం అయింది. నిశ్శబ్దంగా నవ్వే ఆ అందమైన జ్ఞాపకాలు, హృదయం మీద పూల వానలు కురిపిస్తాయి.

పరధ్యానంగా చుట్టుప్రక్కల గమనించకుండా నడుస్తున్నా. ఎక్కడి నుండి వచ్చిందో ఓ కోతి. ఒక్కసారిగా నామీద దాడిచేసి, నా చేతిలో ప్రసాదం ఉన్న క్యారీబేగ్‌ని లాక్కుపోయింది. నేను భయంతో వెర్రికేక పెట్టి పరుగు తీసాను. ఆ ఖంగారులో చీర కాలికి చుట్టుకుని జారిపడ్డాను. ఆ పడటం నడుముకి దెబ్బ తగిలింది. కాలు ముడత పడింది. కళ్ళు బయర్లు కమ్మాయి. చెవుల్లోంచి ఆవిర్లు. అంత చలిలోనూ చెమటలు పట్టాయి. ఏడుపు ఒక్కటే తక్కువ.

'క్యా హువా?'అంటూ అతను రెండు అంగల్లో నా దగ్గరకి వచ్చాడు. గుండె దడకి మాటలు కూడా రావటంలేదు నాకు. చేతి మీద గోళ్ళు గీరుకున్నచోట ఎర్రగా కందింది. నన్ను నేను కంట్రోల్ చేసుకుంటూ, సాక్సు తీసి కాలిని చిన్నగా మసాజ్ చేశాను. అసలు బుద్ధిలేకుండా ఇలా వంటరిగా రావడం ఏమిటి? ఈ డ్రైవర్ ముందు ఇలా ఎంబ్రాసింగ్‌గా ఛా!! రెయిలింగ్ సాయంతో నిలబడ్డాను. మంచుగడ్డ మీద పాదం మోపినట్లుగా ఉంది. నడవడానికి ప్రయత్నించాను. కానీ కుడి పాదం ఒకటే సలుపు. బాధతో వెంటనే కూర్చుండిపోయాను. నా అవస్థ అంతా అతను గమనిస్తూనే ఉన్నాడు.

"ఆప్ బైటియే! మై అభీ ఆయా!" అంటూ చేతిలో చెట్టుకొమ్మని నా ప్రక్కన పడేసి, పరుగులాంటి నడకతో కొండని అడ్డంగా దిగుతూ మాయం అయిపోయాడు.

ఇప్పుడు ఏమిటి దారి? ప్రసాదం బ్యాగ్‌లో పెట్టకుండా ఊపుకుంటూ వచ్చినందుకు నామీద నాకే కోపం వచ్చింది. చేతి మీద చారల్లోంచి రక్తం మెల్లగా పైకి వస్తోంది. చలిగాలికి ఆ చెయ్యి మరింత మండటంతో కర్చీఫ్ తీసి అద్దుకున్నాను. కనీసం సగం దూరం అయినా క్రిందకి దిగాలి. ఈ డ్రైవర్ ఎటుపోయాడో? అతను వచ్చే వరకూ అయినా ఆగాలి. సెల్ తీసి అన్నయ్యకి ఫోన్‌చేద్దాం అనుకున్నాను. కానీ అంత బుద్ధితక్కువ పని మరొకటి ఉండదు.

దూరంగా కోతులు దెబ్బలాడుకుంటూ ప్రసాదాన్ని ఎంజాయ్ చేస్తున్నాయి. నా బ్యాగ్‌లో ఉన్న బిస్కట్ పాకెట్ కూడా వాటివైపు విసిరేశాను. వాటి ఆనందం మరింత ఎక్కువ అయింది. ఇప్పుడిప్పుడే నా గుండె దడ కాస్త తగ్గుతోంది. కాలుని అటు ఇటు కదుపుతూ కాస్త ఎక్సర్‌సైజ్ చేశాను. కాలు క్రింద మోపితే మాత్రం బాధ ఎక్కువగానే ఉంది.

నాలుగేసి మెట్లు ఎక్కుతూ దూరంగా అతను వస్తూ కనబడ్డాడు. చేతిలో ఫ్లాస్కు, చిన్న కవరు ఉన్నాయి. జర్కిన్ చేతులు పైకి జరుపుకుంటూ నాకంటే రెండు మెట్లు క్రిందన కూర్చున్నాడు. కవరులోంచి పెయిన్ కిల్లర్ స్ప్రే కోన్ బయటికి తీసి, షేక్ చేసి, అతని ఎడమ చేతిలో నా పాదాన్ని ఉంచుకుని పూర్తిగా తడిసేలా స్ప్రే చేశాడు. అసలే చలి. అందులో స్ప్రే మరింత చల్లగా తగిలింది. నేల మీద చిన్న టవల్ లాంటిది పరిచి దానిమీద కాలుని జాగ్రత్తగా పెట్టాడు. ఏదో 'టాబ్లెట్' తీసి చేతిలో పెట్టి ఫ్లాస్కులోంచి వేడి టీ వంచి ఇచ్చాడు. నేను కీ ఇచ్చిన బొమ్మలా అతడి సేవలకి రియాక్టు అవుతున్నాను. మనసు ఎప్పుడో మొద్దుబారి పోయింది. ఏదో ఆయింట్‌మెంట్ తీసి చేతికి రాశాడు. వేడి వేడి టీ త్రాగడంతో ప్రాణం లేచి వచ్చింది. తప్పించుకోలేని ఈ పరిస్థితి నాకు చాలా ఇబ్బందిగా, సిగ్గుగా అనిపించింది.

*అసలు ఒక మనిషి బాధలో ఉంటే ఇలా సేవ చెయ్యవచ్చును అని నాకు అనుభవ పూర్వకంగా తెలిసింది. తగిలింది చిన్న దెబ్బలే అయి ఉండవచ్చును. కానీ ఎదుటి మనిషి నుండి వచ్చే ఆ 'కేర్' ఆ చిన్నపాటి 'కన్‌సర్న్' చాలా హాయిని, ధైర్యాన్ని యిస్తుంది.*

అసలు ఒక మనిషి బాధలో ఉంటే ఇలా సేవ చెయ్యవచ్చును అని నాకు అనుభవ పూర్వకంగా తెలిసింది. తగిలింది చిన్న దెబ్బలే అయి ఉండవచ్చును. కానీ ఎదుటి మనిషి నుండి వచ్చే ఆ 'కేర్' ఆ చిన్నపాటి 'కన్‌సర్న్' చాలా హాయిని, ధైర్యాన్ని యిస్తుంది.

అసలు మగవాళ్ళలో ఇంత సున్నితత్వం! నాకు ఆశ్చర్యంగానూ, అపురూపంగానూ అనిపించింది. ఫార్మాలిటీ కోసం రోజుకి కనీసం పదిసార్లు అయినా వాడే 'థ్యాంక్సు' అన్న పదం అప్రయత్నంగా నా నోటిమీద వచ్చింది. నా కళ్ళలో కనబడిన కృతజ్ఞతకి అతడు పసిపాపలా నవ్వేశాడు. అప్రయత్నంగా నాకూ నవ్వు వచ్చింది.

స్ప్రేవల్ల కాలు మొద్దుబారిపోయి నడుస్తూ ఉంటే నెప్పి తెలియనివ్వటం లేదు. కారు ఎక్కాక విపరీతమైన అలసటతో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాను. జీవితంలో మొట్టమొదటిసారి ఒక మగవాని ప్రక్కన 'అనీజీనెస్' ఫీల్ అవ్వకుండా కూర్చోగల్గుతున్నాను.

శాశించే కళ్ళు, అధికారాన్ని, అహాన్ని ప్రదర్శించే మాటతీరు, కోర్కెని, వెకిలితనాన్ని బయటపెట్టే ప్రవర్తన. ఒంటరి, పెళ్ళికాని ఆడది అంటే 'పబ్లిక్ ప్రాపర్టీతో' సమానంగా భావించే సమాజం. అసలు నేను మగవాడిని సాటి మనిషిగా గుర్తించలేదు. ఎప్పుడూ అతని పంజాకి అందనంత దూరంగా పారిపోయి, 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకోవడానికే ప్రయత్నించాను.

కానీ వింతగా ఈ వ్యక్తి సమక్షంలో మనసు సేద తీరుతోంది. ఎదుటి వాళ్ళని హాయిగా ఉంచగలిగే విద్య ఏదో ఇతడికి తెలిసి ఉండాలి. జన్మ అంతా ఇలా కూర్చుని వెళ్ళిపోతూ ఉంటే ఎంత బావుంటుంది. నా ఆలోచనలకి బ్రేక్ పడడంతో ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను. కారు దిగుతూ ఉంటే సాయంత్రం వేసుకోమని మరి రెండు 'టాబ్లెట్'లు నా చేతిలో పెట్టాడు.

మంచం మీద వాలినా నిద్ర రావటంలేదు గానీ, ఆలోచనలు నన్ను తరుముతున్నాయి. చాలా చిన్న సంఘటన- కళ్ళు మూసుకుంటే నా పాదాన్ని తన చేతిలో ఉంచుకొని అతి జాగ్రత్తగా స్ప్రే చేస్తున్న అతడే గుర్తుకి వస్తున్నాడు.

నేను పుట్టిన దగ్గరనుండి ఎంతోమంది మగవాళ్ళని చూసి ఉంటాను. వీళ్ళు అందరూ పేపర్ బాయిలాగా, పోస్టుమేన్‌లాగా మనసు ముంగిటలోంచి ప్రక్కకి తప్పుకున్న వాళ్ళే. ఇలా నా అనుమతి లేకుండా లోపలికి వచ్చేసి, నా ఆలోచనలలో చోటుచేసుకున్న వాళ్ళు ఎవరూ లేరు.

చేదు అనుభవాల మధ్య, ఎన్నో అదుపు ఆజ్ఞల మధ్య గొంగళి పురుగులా ముడుచుకుపోయిన మనసుని తట్టిలేపిన ఈ వ్యక్తిలోని ప్రత్యేకత ఏమిటి? ఓ చిన్న సహాయానికి నేను నా వయస్సుని కూడా మర్చిపోయి తల్లక్రిందులుగా పడిపోయానా?

మనిషిని కళ్ళు, ముక్కు, చెవులు, కాళ్ళు ఆధారంగా గుర్తిస్తాం. కానీ ఓ మనిషిని గుర్తించడానికి అసలైన ఆధారం 'మనసే!' ఈ విషయం ఒప్పుకుందుకు నాకు అహం ఎందుకు అడ్డువస్తోంది?

"ఆఖరికి వీడు కూడా కనిపెట్టేశాడు అన్నమాట! నువ్వు ఉద్యోగస్తురాలివి అని! ఇంకనే వెళ్ళేటప్పుడు అడుగుతాడు చూడు" విషయం తెలిసిన తర్వాత అన్నయ్య రియాక్షన్ ఇది.

నా మేనల్లుడు మాత్రం వాడి చిట్టి చిట్టి చేతులతో నా దెబ్బకి మందు రాశాడు.

"బాగా నొప్పిగా ఉందా! అత్తా!!" అంటూ వాడికి చేతనైన రీతిలో నన్ను ఓదార్చాడు. వాడి ఓదార్పుకి నిజంగానే నేను కరిగిపోయాను. వాడి జుత్తులో వేళ్ళుపోనిచ్చి, గుండెలకి హత్తుకుంటే, అప్పటిదాకా నేను పడ్డ ఆరాటం, ఆ టెన్షన్ మెల్లగా సద్దుకున్నట్లు అనిపించింది.

"ఓరెయ్! రారా!! అక్కడ పడుకుందువుగాని. నీ గోలతో అత్తని విసిగించకు. అసలే తనకి వంట్లో బాగోలేదు" అంటూ వదిన వాడ్ని బలవంతంగా నా చేతుల్లోంచి లాక్కుపోయింది.

హక్కు లేనిచోట ఆప్యాయతని పంచలేం. మొట్టమొదటిసారి నామీద నాకే జాలి వేసింది. ఆ భగవంతుడు నాకు చాలా అన్యాయం చేశాడు. అవసరం అయిన దానికంటే అన్నీ ఎక్కువ ఇచ్చి. స్పందించే మనసుని మరి కాస్త యిచ్చి నన్ను అగాధం అంచుల్లో నిలబెట్టాడు.

అన్నయ్య చెప్పినట్లు ఓ రెండువందలు ఇచ్చేసి, రేపటి నుండి అతన్ని మర్చిపోవచ్చు కూడా! కానీ సమస్య అతను కాదు. 'డబ్బు' అనే కళ్ళజోడు లోంచి చూస్తే ఏ మనిషిలోనూ గొప్పతనం కనబడదు.

జీవితంలో మళ్ళీ నాకంట పడని ఓ వ్యక్తి చూపించిన చిన్నపాటి ఆదరణకి మనసు అట్టడుగు పొరల్లో గాఢ సుషుప్తిలో ఉన్న ఓ 'భావం' ఒక్కసారిగా చైతన్యవంతమై 'సునామీ' కెరటంలా నన్ను నిలువునా ముంచేసింది. అది ఏమిటి?

ఉక్కిరి బిక్కిరి చేసే ఈ 'ఫీలింగ్'నుంచి బయటికి రావాలని లేదు. అలా అని భరించనూ లేను. కానీ నేను తలుచుకుంటే దారి మళ్ళించగలను. ఓ చిన్న ప్రాణికి నాదైన 'హక్కు'తో జీవితాన్ని ప్రసాదించగలను.

ఇప్పుడు అతను ఎక్కడ ఉండాలో అక్కడే ఉన్నాడు. నేను మాత్రం ఎగిరిపడే నా మనసు మీద 'బాధ్యత'అనే బరువుని పెట్టాను. మరో జన్మకి శ్రీకారం చుట్టాను. ★